

డీటీవోగా ఐశ్వర్యారెడ్డి బాధ్యతల స్వీకరణ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 25: నంద్యాల జిల్లా రవాణ శాఖ అధికారిగా ఐశ్వర్యారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా ఐశ్వర్యారెడ్డి నంద్యాల డీటీవోగా వచ్చారు. ఇంతకుముందు విజయవాడలో రవాణ శాఖ అధికారిగా విధులు నిర్వర్తించేవారు. డీటీవో ఐశ్వర్యారెడ్డిని రవాణ శాఖ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాలోని అంశాలపై సిబ్బందితో చర్చించారు.

- రిజర్వాయర్ భద్రత గాలికి
- మట్టితో పూడ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- ప్రమాదపు అంచుల్లో జలాశయం
- గత నెల 13వ తేదీనే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి
- పట్టించుకోని ఎస్సార్బీసీ అధికారులు

ఆందోళనలో లోతట్టు గ్రామాల ప్రజలు, రైతులు

కుంగిన అవుకు రివిట్‌మెంట్..!

నంద్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి)/అవుకు: అవుకు రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నిర్వహణ సరిగా లేకపోవటంతో ఎర్రరాతిలో నిర్మించిన రివిట్‌మెంటు కుంగిపోయింది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ముందుగానే హెచ్చరిస్తూ 'ఉధృతి పెరిగితే భద్రత అంతే..!' అనే కథనాన్ని గత నెల 13వ తేదీన ప్రచురించింది. అయినా ఎస్సార్బీసీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. రిజర్వాయర్ పరిస్థితిని పరిగణలోనికి తీసుకుకోకుండానే పూర్తిస్థాయిలో నీరు నింపారు. దీంతో పాలేరు స్లూయిస్, స్పిల్‌వే గేట్ల నుంచి నీరు లీకవుతోంది. మరోపక్క రిజర్వాయర్‌లోని అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు కట్ట లోపలి భాగంలోని ఎర్రరాతి రివిట్‌మెంటు కుంగింది. మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు వర్షపునీటి ధాటికి కోతలకు గురవుతున్నాయి. ఇలాంటి స్థితిలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీద విమర్శలు వినిపిస్తున్నాయి. రివిట్‌మెంటు కుంగితే ఏమిటని, కుంగిన చోట మట్టితో పూడుస్తామని అధికారులు దురుసుగా సమాధానం చెబుతున్నారు. దీన్నిబట్టి రిజర్వాయర్ భద్రతపై అధికారులు ఏ స్థాయిలో శ్రద్ధ కనబరుస్తున్నారో అర్థమవుతోంది. అయితే రైతులు, లోతట్టు గ్రామాల ప్రజలు రిజర్వాయర్‌కి ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.



రిజర్వాయర్ కట్టలోపల కుంగిన రివిట్‌మెంట్


నిడుకుండలా అవుకు రిజర్వాయర్


కుంగిన రివిట్‌మెంట్‌ను మట్టితో పూడ్చివేసిన దృశ్యం

● పట్టించుకోరే..

పాలేరు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ 2001లో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. మొదటిదశ 1.86 టీఎంసీల నీటి సామర్థ్యంతో 2005లో పూర్తిచేశారు. రెండవదశ పనులను 2005లోనే ప్రారంభించి 2010 నాటికి 4.148 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. అయితే పాలేరు, తిమ్మరాజు చెరువులకు గతంలో ఉన్న తూముల వద్ద నిర్మాణ లోపం జరిగినట్లు స్పష్టంగా కనపడుతోంది. ప్రారంభంలో 1.86 టీఎంసీల సామర్థ్యం ఉన్నపుడు రిజర్వాయర్‌లో నీటిని నింపిన వెంటనే పాలేరు చెరువు తూము వద్ద రివిట్‌మెంటు కుంగి భారీ గండి పడింది. నీరు లోతట్టు ప్రాంతాలోని పొలాల్లోకి చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇక గతంలో తిమ్మరాజు తూము వద్ద నుంచి నీరు లీకవుతుండటంతో 2015లో డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ బృందం పరిశీలించింది. తూము నిర్మాణంలోని ప్రాంతంలో అక్కడక్కడ రంధ్రాలు వేసి ప్లాస్టిక్ పైపులను ద్వారా కాంక్రీట్‌ను లోనికి పంపి లీకేజీని కొంత మేర అరికట్టారు. రిజర్వాయర్‌కు పొంచి ఉన్న ముప్పును దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పిల్‌వే గేట్ల మరమ్మతుల కోసం రూ. 2.01 కోట్లు, పాలేరు స్లూయిస్ మరమత్తుల కోసం రూ.45 లక్షల అంచనా వ్యయాన్ని రూపొందించి 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వానికి పంపారు. జగన్ ప్రభుత్వం నిధులు విడుదల చేయటంలో ఏమాత్రం శ్రద్ధ వహించకుండా అవుకు రిజర్వాయర్ నిర్వహణను గాలికి వదిలేసింది. దీనివల్లే రిజర్వాయర్ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. గతంలో రివిట్‌మెంటు కుంగిన తిమ్మరాజు చెరువు ప్రాంతంలోనే ప్రస్తుతం మళ్లీ కుంగింది. రిజర్వాయర్ భద్రతపై నీలినీడలు కమ్ముకున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రివిట్‌మెంటు కుంగిన చోట నల్లమట్టితో పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో కాంక్రీట్ ద్వారా రివిట్‌మెంటును రిపేరు చేసినా ఫలితం ఇవ్వని చోట మట్టితో పూడ్చటమేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వాయర్‌కు ఏదైనా ప్రమాదం ఏర్పడినపుడు అధికారులు తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపటంలో విఫలమవుతున్నారని అధికారులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మట్టికట్టలపై పెరిగిన పిచ్చి మొక్కలు


కుంగిన రివిట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఇన్ ఫ్లో ఎక్కువ.. అవుట్ ఫ్లో తక్కువ

రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు. రిజర్వాయర్‌ను పూర్తిస్థాయి నీటిమట్టంతో నింపేందుకు అటవీశాఖ అనుమతి లేకపోవటంతో ఐదేళ్ల కిందటి వరకు రిజర్వాయర్‌ను 3 టీఎంసీలకే పరిమితం చేశారు. మూడేళ్ల నుంచి మాత్రమే రిజర్వాయర్‌ను 4 టీఎంసీల నీటితో నింపుతున్నారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ నుంచి 11,300 క్యూసెక్కులు, ఎస్సార్బీసీ నుంచి 600 క్యూసెక్కులు నీరు వచ్చి రిజర్వాయర్‌లో చేరుతుండటంతో పాటు, వర్షాల కారణంగా ఎర్రమల కొండల నుంచి భారీగా నీరు వచ్చి రిజర్వాయర్‌లో చేరుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 4.148 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో అనుగుణంగా అవుట్‌ఫ్లోను విడుదల చేయటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. వాస్తవానికి అవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్ఎస్ఎస్ ద్వారా కడప జిల్లాకు 20వేల క్యూసెక్కుల నీటిని తరలించే అవకాశం ఉంది. కానీ అధికారులు మాత్రం బుధవారం మధ్యాహ్నం వరకు 5,300 క్యూసెక్కులను మాత్రమే విడుదల చేయగా, సాయంత్రానికి 7 వేల క్యూసెక్కులకు పెంచారని తెలుస్తోంది. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోలో భారీ తేడా ఉండటంతో పాటు, రిజర్వాయర్ రివిట్‌మెంటు పటిష్టంగా లేకపోవటంతోనే కుంగిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

రైతులు, లోతట్టు గ్రామాల ప్రజల ఆగ్రహం..

ఉదయం 8 గంటలకు తిమ్మరాజు చెరువు కట్టవద్ద రివిట్‌మెంట్ కుంగిన విషయం స్థానికులకు తెలిసింది. రిజర్వాయర్‌కు ఎలాంటి ప్రమాదం వాటిల్లినా లోతట్టు గ్రామాలైన చెన్నంపల్లె, శివవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం, చిన్నకొట్టాల, ఓబుళాపురం, శింగనపల్లె గ్రామాలు మునకకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో రివిట్‌మెంటు కుంగిన విషయాన్ని వెంటనే ఎస్సార్బీసీ అధికారులకు చేరవేశారు. స్థానిక రైతులు, లోతట్టు గ్రామాల ప్రజలతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి రిజర్వాయర్‌కు చేరుకుని అధికారుల కోసం ఎదురు చూడసాగారు. అయితే జేఈ సుధాకర్ మాత్రమే అక్కడికి వచ్చారు. తిమ్మరాజు చెరువు కట్టను పర్యవేక్షించే ఎస్సార్బీసీ డీఈ కొండన్న గానీ, ఇతర అధికారులు గానీ జాడ లేరు. వీరు తీరిగ్గా మధ్యాహ్నం 1-30 గంటలకు రిజర్వాయర్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత రివిట్‌మెంటును మట్టితో పూడ్చటం మొదలుపెట్టారు. మట్టితో పూడ్చటమేమిటని రైతులు, నాయకులు డీఈ కొండన్నను అడగ్గా రివిట్‌మెంటును ఎర్రరాతితో గాని సిమెంట్ కంకరతో గాని పూడ్చాల్సిన పనిలేదని, మట్టితో కూడా పూడ్చవచ్చని దురుసుగా సమాధానమివ్వటం గమనార్హం.

గతంలోని తూముల వద్ద శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



గతంలోని పాలేరు, తిమ్మరాజు తూముల వద్ద నిర్మాణ లోపం ఉన్నట్లు స్పష్టమ వుతోంది. ఆ ప్రాంతాల నుంచే నీరు ఇప్పుడు లీకవుతోంది. రివిట్‌మెంట్ కుంగినచోట మట్టిని కప్పి ఎస్సార్బీసీ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అలా కాకుండా భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

చిన్న శివారెడ్డి, రైతు, చెన్నంపల్లె

రిజర్వాయర్‌పై అధికారుల పర్యవేక్షణ కరువు



రిజర్వాయర్‌పై ఎస్సార్బీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇన్‌ఫ్లో భారీస్థాయిలో ఉండి రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం పూర్తి స్థాయికి చేరుకున్నా అవుట్ ఫ్లో పెంచక పోవటం, ఇన్‌ఫ్లో తగ్గించుకోక పోవటం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది.

- ఎల్లాల శ్రీనివాసులు, రైతు, అవుకు

స్పిల్‌వే గేట్లతో ప్రమాదం పొంచి ఉంది



స్పిల్‌వే గేట్లు ఎప్పటి నుంచో మరమ్మతులకు నోచుకోక తుప్పు పట్టి పోయాయి. ఆరు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. ప్రమాదవశాత్తు గేట్లు కొట్టుకుపోతే లోతట్టు గ్రామాలు మునకకు గురవుతాయి. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతు చేపట్టాలి.

- రాజారెడ్డి, రైతు, చిన్నకొట్టాల

రివిట్‌మెంట్ కుంగితే ఏమవుతుంది?

రిజర్వాయర్ కట్టమీద రివిట్‌మెంట్ కుంగితే ఏమవుతుంది? ప్రమాదం లేదు. కుంగిన ప్రాంతాన్ని మట్టితో పూడ్చుతున్నాం. రివిట్‌మెంట్‌ను ఎర్ర రాతితో గాని సిమెంట్ కంకరతో గాని పూడ్చాల్సిన పని లేదు.

- కొండన్న, ఎస్సార్బీసీ డీఈ, అవుకు

మన ప్రభుత్వంలో ప్రజలకు సుఖశాంతులు

● మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25: మన ప్రభుత్వంలో ప్రజలకు సుఖశాంతులు కలుగుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో సర్పంచ్ ఓబులేసు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ గ్రామసభలో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ప్రజలందరూ అష్ట కష్టాలపాలయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నవశకం ప్రారంభమైందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజారంజక పాలన అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాల కృషి చేస్తున్నారని అన్నారు. విజయవాడ వరదలలో సర్వస్వం కోల్పోయినవారికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధికి ఒక ప్రణాళిక రూపొందించి నివేదికలు సమర్పించాలని, అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా ప్రగతిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని అన్నారు. ప్రజలకు అవసరమైన పతకాలను ప్రభుత్వం అందజేస్తుందని, వాటి ఫలాలు అందరూ అనుభవించాకే ప్రభుత్వానికి మంచి సమకూరుతుందని తెలిపారు. జిల్లా విద్యా, విజ్ఞాన, వికాస, సాంకేతిక పురోగాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యకరంగా జీవించాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన కొమ్ము రమణారెడ్డి వరద బాధితుల సహాయార్థం రూ.15000 నగదును కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ ప్రియదర్శిని, ఎండీవో సుగుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

16 క్షేత్రాల్లో ఫౌండేషన్ సీడ్స్ ఉత్పత్తి

● రాష్ట్ర వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 25: రాష్ట్ర వ్యాప్తంగా 16 వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రాల్లో ఫౌండేషన్ సీడ్స్ ఉత్పత్తి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ జేడీ కృపాదాసు తెలిపారు. జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో సాగు చేసిన కంది పైరును పరిశీలించారు. క్షేత్రం సాగు చేసిన పంటల వివరాలను ఏడీఏ అరుణలతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఖరీఫ్‌లో రూ.214 కోట్లతో 6.63 లక్షల క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రత్యామ్నాయసాగుకోసం రూ. 6కోట్ల సబ్సిడీతో 69 వేల క్వింటాళ్ల మినుము, పెసర, ఉలువలు తదితర రకాల విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని చెప్పారు. గోదావరి జిల్లాల్లో ఇటీవల కురిసిన వరదలకు 80 శాతం రాయితీతో అందించినట్లు చెప్పారు. శ్రీకాకుళం, సామర్లకోట, హండీ, ఘంటశాల, కోమలి వ్యవసాయ క్షేత్రాల్లో వరి ధాన్యం, తంగడంచ, అమరావతి క్షేత్రాల్లో కంది, ఎదురూరు క్షేత్రంలో పప్పుశనగ ఫౌండేషన్ సీడ్స్‌ను ఉత్పత్తి చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డిమాండు బట్టి గ్రామ విత్తన పథకం ద్వారా రైతులకు అందిస్తున్నామని అన్నారు. తంగడంచ విత్తనోత్పత్తి క్షేతంలో 623 ఎకరాలకుగానూ 211 ఎకరాల్లో కంది సాగు చేశామని తెలిపారు. అనంతరం తంగడంచలో జరిగిన పొలం పిలుస్తోంది అనే కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, విత్తనోత్పత్తి క్షేత్రం ఏడీఏ అరుణలత, ఏవోలు శ్రావణి, కిషోర్, తేజశ్వరీదేవి, నిర్మల, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.


కంది పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ జేడీ కృపాదాస్

రైతులకు అందుబాటులో ఎరువులు

వెలుగోడు: రైతుసేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్రవ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కృపాదాసు అన్నారు. బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణతో కలిసి వెలుగోడులోని రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఏడీఏ ఆంజనేయ, ఏవో పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయడమేమనగా ఈ ప్రకటనలో కనబరచిన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **కూసం రత్నారెడ్డి** అను అతను **17.02.1960**వ తేదీన **కొండా బసివిరెడ్డి** వారి ద్వారా విక్రయించుకొని అనుభవించుచుండినాడు. తదుపరి సదరు కూసం రత్నారెడ్డి గారు గతించుట ద్వారా అతని ఏకైక వారసుడైన **కూసం వెంకటరామిరెడ్డి** గారితో దిగువ షెడ్యూలు ఆస్తిని **లక్కిరెడ్డి లక్ష్మిదేవి** గారు **24.07.2008**వ తేదీన విక్రయించుకొని అనుభవించుచున్నది. తదుపరి సదరు ఆస్తిని **లక్కిరెడ్డి లక్ష్మిదేవి గారు** తన **కూతురైన యరబోలు సుభాషిణి, భర్త : వై.గంగాధరరెడ్డి గార్కి** **16.11.2009** దానదస్తావేజు వ్రాయించి యిచ్చివుంటున్నది. ప్రస్తుతం దాన దస్తావేజు ద్వారా హక్కులు రాబడిన యరబోలు సుభాషిణి గారు సదరు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **బ్యాంక్ ఆఫ్ ఇండియా లో ఆయకం వుంచి లోను** పొందుగోరుచున్నారు. కావున సదరు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు ఏమైనా హక్కులు వున్నయెడల ఈ ప్రకటన తేదీ నుంచి వారం రోజులలోగా మా ఆఫీసు నందు సంప్రదించవలసినదిగా తెలియజేయచున్నాము.


షెడ్యూలు : నంద్యాల రి.డిలో చేరిన నంద్యాల సబ్.డిలో వున్న చాపిరేవుల మజరా, పాండురంగాపురం గ్రామంలోని స్థిరాస్థి యొక్క వివరం. సర్వే నెంబరు : **295/1 పైకి, ఎ.0.20 సెంట్లు 100 లింకులు. దిశలు : తూర్పు :** కూసం వెంకటరామిరెడ్డి మరియు కూసం సుబ్బారెడ్డి వగైరా స్థలాలు, **పడమర :** భీమిరెడ్డి రామకోటిరెడ్డి మరియు పశువుల ఆస్పత్రి స్థలం, **ఉత్తరం :** రస్తా, **దక్షిణం :** అరిమంద వెంకటేశ్వరరెడ్డి మరియు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి భూములు.

శ్రీ జి.మహేష్, అడ్వకేటు
నంద్యాల. సెల్ : 98853 53739.

శ్రీశైలానికి భారీగా వరద

శ్రీశైలం, సెప్టెంబరు 25: శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం భారీగా నమోదయింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 88,849 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,437 మొత్తం 1,02,286 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 56,570 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 875.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 163.5820 టీఎంసీలులుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 13,919 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

చంద్రబాబు పర్యటన రద్దు



కర్నూలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ పర్యటన రద్దయింది. పత్తికొండ నియోజకవర్గంలో గురువారం జరిగే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు వస్తున్నారనే సమాచారం రావడంతో కలెక్టరు పి.రంజిత్‌బాషా ఏర్పాట్లపై సమీక్షించారు. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, సిబ్బంది సైతం గ్రామానికి చేరుకున్నారు. భారీ జన సమీకరణ కోసం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఇంతలోనే సీఎం చంద్రబాబు మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి రావడం, వాతావరణం కూడా సహకరించకపోవడం లేదని పర్యటన రద్దయిందని సీఎంవో ఆఫీసు నుంచి జిల్లా అధికారులకు సమాచారం వచ్చింది. సీఎం రావడం లేదని సాయంత్రం సమాచారం వచ్చిందని కలెక్టరు పి. రంజిత్‌బాషా ఆంధ్రజ్యోతికి వివరించారు.

పుచ్చకాయలమడకు అచ్చిరాని సీఎం పర్యటన

ఆగస్టు 31న పింఛన్ల పంపిణీ చంద్రబాబు పుచ్చకాయలమడకు రావాల్సి ఉండగా రద్దయింది. భారీ వర్షాల కారణంగా పుచ్చకాయలమడ నుంచి కార్యక్రమాన్ని మండల కేంద్రం ఓర్వకల్లుకు మార్చారు. తాజాగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి చంద్రబాబు వస్తారనుకుంటే రద్దయింది. దీంతో పుచ్చకాయలమడ గ్రామానికి సీఎం చంద్రబాబు పర్యటన అచ్చిరాలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

టీడీఆర్ బాండ్లపై నిగ్గు తేల్చండి!



కర్నూలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫెరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీలో గత వైసీపీ ప్రభుత్వంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అధికారం మాటున నిబంధనలకు తుంగలో కలిపేసి టీడీఆర్ పత్రాల రూపంలో అప్పటి వైసీపీ నాయకులు, వారి సిఫారసులతో బిల్డర్లు, రియల్ ఎస్టేటర్లకు ప్రజాధనం దోచిపెట్టారనే ఆరోణలు వెల్లువెత్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా టీడీఆర్ పత్రాల జారీ ద్వారా భారీ కుంభకోణం జరిగిందని టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. కర్నూలు నగర పాలక సంస్థ కూడా 135 బదిలీ చేయదగ్గ అభివృద్ధి హక్కులు (టీడీఆర్) బాండ్ల జారీ చేశారు. గత జగన్ ప్రభుత్వంలో అధికారం అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై టీడీఆర్ పత్రాలు జారీ చేసినట్లు సమాచారం. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు టీడీఆర్ పత్రాలు, భవన నిర్మాణ దరఖాస్తులను టౌన్ ప్లానింగ్ అధికారులు ఆపేశారు. అయినప్పటికీ మున్సిపాలిటీ యంత్రాంగంలో మార్పు కనిపించడం లేదు. దీంతో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పత్రాలు ఎంత వరకు నిజాయితీగా జారీ చేశారు..? ఏ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయి..? నిగ్గు తేల్చడమే కాకుండా టీడీఆర్ ప్రక్రియ క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. నగర పాలక సంస్థ జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై సమగ్ర విచారణలో భాగంగా టీడీఆర్ జారీ చేసిన ఇంటి నెంబరు, సర్వే నంబరు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ హక్కుదారులు ఎవరు..? ఏ వ్యక్తి పేరిట జారీ చేశారు, ఆ వ్యక్తి నిజమైన హక్కుదారుడేనా?.. ఇలా పక్కా ఫార్మెట్ తయారు చేసి పూర్తి వివరాలతో సర్వే చేయాలంటూ రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు కార్పొరేషన్‌ల్లో జారీ చేసిన టీడీఆర్ బాండ్లు:

సంవత్సరం	టీడీఆర్ బాండ్లు
2019	13
2020	15
2021	52
2022	31
2023	24
మొత్తం	135

కర్నూలులో 135 టీడీఆర్ బాండ్లు జారీ:

గత వైసీపీ ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్ల జారీపై రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఆరోపణల వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా కర్నూలు కార్పొరేషన్ ద్వారా టీడీఆర్ బాండ్లు ఏమైనా జారీ చేశారా..? అని అప్పటి కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళితే.. అలాంటి బాండ్లు జారీ చేయలేదు. పెద్దపెద్ద మెట్రోపాలిటీ నగరాల్లో వీటిని జారీ చేస్తారని ఏడాది క్రితం వివరించారు. ప్రభుత్వం మారింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. టీడీఆర్ బాండ్ల జారీపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సై అనడంతో కర్నూలు నగర పాలక సంస్థ 135 టీడీఆర్ బాండ్లు జారీ చేసిందని, ఏ వ్యక్తి పేరిట ఈ బాండ్ ఇచ్చారు, టీడీఆర్ సర్టిఫికెట్ నంబరు, జారీ చేసిన తేదీ, సర్వే నంబరు, వార్డు నంబరు, ఇంటి నంబరు, ఎంత విస్తీరణ స్థలం నగర పాలికకు స్వాధీనం చేశారు, ఎంత విస్తీర్ణం టీడీఆర్ ఉపయోగించుకుంటారు.. ఇలా సమగ్ర వివరాలతో టీడీఆర్ వివరాల జాబితా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులకు రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టరు పంపించారు. 2019 జనవరి నుంచి 2024 జూన్ వరకు కర్నూలు నగర పాలక సంస్థ 135 బదిలీ చేయదగిని అభివృద్ధి హక్కులు (టీడీఆర్) జారీ చేసింది. అందులో గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2019 మార్చి 20న ఒక టీడీఆర్ జారీ చేశారు. అది కూడా ఎన్నికల సమయం. వైసీపీ అధికారంలోకి వచ్చాక 134 టీడీఆర్ బాండ్లు జారీ చేయడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అందులో కార్పొరేషన్ మేయర్ బీవై రామయ్య బాధ్యతలు చేపట్టాకే వందకు పైగా జారీ చేసినట్లు తెలుస్తోంది. సుంకేసుల రహదారిలో తుంగభద్ర నదీతీరంలో ఓ భూ యజమానికి నుంచి రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కోసం ఓ బిల్డర్ కొంత భూమిని తీసుకున్నారు.

● గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జారీ
● రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి
● సమగ్ర విచారణ చేయాలంటూ టౌన్ ప్లానింగ్ డైరెక్టరు ఆదేశాలు
● కర్నూలు నగర పాలక సంస్థలో 135 బాండ్లు జారీ
● మేయర్ బీవై రామయ్య బాధ్యతలు చేపట్టాకే వందకు పైగా
● నగర పాలక ప్రజాధనం దోచిపెట్టారనే ఆరోపణలు

డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ మాత్రం రాసుకున్నారు. ఆ బిల్డరుకు ఎలాంటి భూ హక్కులు లేవు. పైగా అగ్రిమెంట్ గడువు కూడా తీరిపోయిన తరువాత.. ఆ బిల్డర్ పార్కు డెవలప్‌మెంట్ కోసం కొంత భూమి ఇచ్చాడని, ఆ భూమికి బదులుగా దాదాపు రూ.13 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు సమాచారం. ఈ భూమి కూడా తుంగభద్ర నది బఫర్ జోన్ పరిధిలోని భూమి అని పక్కా రికార్డులు ఉన్నాయి. నగర పాలక అధికారులు, పాలకులు కాసులకు కక్కుర్తిపడి ఇష్టారాజ్యంగా టీడీఆర్ ఇచ్చారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేస్తే భారీ కుంభకోణం వెలుగు చూస్తుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు నిబద్ధత, నిజాయితీతో విచారణ చేస్తారా..? రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి నామమాత్రపు సర్వేతో సరిపుచ్చుతారా..? అన్నది తేలాల్సి ఉంది.

పెండింగ్ బిల్లులపై నేడు అత్యవసర సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 25: పెండింగ్ బిల్లులపై గురువారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత బుధవారం గుంటూరులో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న మార్కెట్ యార్డులో పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించేందుకు డైరెక్టర్ విజయ సునీత మొదటి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. కర్నూలు మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లకు సంబంధించిన షాపుల నిర్మాణంతోపాటు రూ.6 కోట్లతో నిర్మిస్తున్న జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాలు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల డైరెక్టర్ విజయ సునీత, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో పర్యటించి నిలిచిపోయిన పనుల వల్ల రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో స్వయంగా పరిశీలించారు.

రైతులు డ్రిప్ పరికరాలను అందుకోండి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 25: ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రిప్ పరికరాలు అందించేందుకు నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ ఉమాదేవి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, బోర్లు కలిగి ఉన్న రైతులు నీటి పొదుపు కోసం పంటల సాగును డ్రిప్ ఏర్పాటు ద్వారా ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగు చేయవచ్చని అందువల్ల రైతులు డ్రిప్ పరికరాల ఏర్పాటు కోసం గ్రామాల్లోని రైతు సలహా కేంద్రాలతో పాటు తమ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఎక్సైజ్ డీసీగా శ్రీదేవి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 25: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఉమ్మడి కర్నూలు, నంద్యాల డిప్యూటీ కమిషనర్‌గా శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ డా హనుమంతరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు సూపరింటెండెంట్‌గా కర్నూలులో యథావిధిగా సుధీర్ కుమార్ కొనసాగించింది. నంద్యాల సూపరింటెండెంట్‌గా ఎస్ రవికుమార్‌ను నియమించింది.

హామీలను మరిచిన ప్రభుత్వం: కాంగ్రెస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం మరిచిందని నంద్యాల పార్లమెంట్ డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడంపై ఆయన స్పందించారు. వంద రోజుల్లో సామాజిక పెన్షన్ల పెంపు మినహాయిస్తే సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన పథకాలను విస్మరించిందని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట గరిటె, స్టీల్ ప్లేట్లతో శబ్దం చేస్తూ నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల మేరకు సామాజిక పెన్షన్లు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని అది మినహా ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. యువగళం కింద నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్, ప్రతి ఇంటికీ ఏడాది ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను వీలైనంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి ప్రణాళికలను మొక్కుబడిగా కాకుండా తాగు నీరు, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన, తదితర అన్ని అంశాలను క్రోడీకరించి రూపొందించాలని అధికారులను సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 4,876 కార్యక్రమాలు జరిగాయన్నారు. జిల్లాలో 567 గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్‌లతో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మళ్లీ పతనం దిశగా పత్తి ధర

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 25 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు మూడో రోజు మళ్ళీ పతనం అయ్యాయి. బుధవారం పత్తి ధర గరిష్ఠంగా క్వింటం రూ.7561 పలికింది. వారం రోజుల్లోనే పత్తి ధర క్వింటా నికి రూ.800పైగా ధర తగ్గింది. ఖరీఫ్ సీజన్ పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటసాగు ఖర్చులు కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 15రోజుల కిందట రూ.8300పైగా పలికిన ఊరించిన ధరలు పతనం దిశగా కొనసాగుతుండడంతో రైతులు సాగు పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేపరిస్థితి కనిపించడం లేదని అప్పులే మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు దూది ధరలు పతనం కావడమే స్థానిక మార్కెట్ యార్డ్‌లో ధరల పతనానికి కారణమని చెబుతున్నారు. 8016 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,211, గరిష్ఠ ధ రూ.7,561 మధ్యస్థ ధర రూ. 7,389 పలికింది.

అందరి సహకారంతోనే అవినీతి అంతం

సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్



మాట్లాడుతున్న ఆర్పీ పట్నాయక్, బక్కని నర్సింహులు



ఉద్యోగులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 25: అందరి సహకారంతోనే అవినీతి రహిత సమాజం సాధ్యమని సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రైవేటు హోటల్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్(యాక్) ఆధ్వర్యంలో నిజాయితీ ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ అవినీతిపరుల్లో ఎప్పుడూ అభద్రత భావం ఉంటుందని, స్వేచ్ఛగా జీవించలేరన్నారు. నిజాయితీపరులు గర్వంగా నలుగురికి ఆదర్శంగా సమాజంలో బతుకుతారని, వీరిని చూసి అవినీతిపరుల్లో కొంతైన మార్పు వస్తే మెరుగైన సమాజం సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరైనా తమకు అప్పగించిన బాధ్యతలను ఫలితం ఆశించకుండా అంకితభావంతో చేసినప్పుడే అవినీతి అంతమవుతుందని అన్నారు. ప్రధానంగా అవినీతిపై యువతలో పరివర్తన రావాలని, నిజాయితీపరుల సంఖ్య పెరగాలని, అప్పుడే మంచి సమాజ నిర్మాణం చేయవచ్చునని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ తప్పు చేస్తే ప్రశ్నించే తత్వం ప్రజల్లో రావాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించేవారు పరోక్షంగా అవినీతిని ప్రోత్సహించినట్లే అవుతుందన్నారు. నిజాయితీ ఉద్యోగులకు చేసే సత్కారం మరి కొందరికి స్ఫూర్తి కావాలన్నారు. నాయకుడు అనేవారు నిష్పక్షపాతంగా, న్యాయబద్ధ పాలన అందించినప్పుడే అవినీతిని నియంత్రించవచ్చునని తెలిపారు. యాక్ వ్యవస్థాపకులు పలనాటి రాజేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవకులు అని, వారి సేవలకు ప్రజలు కట్టే పన్నుల నుంచే జీతాలు చెల్లిస్తారని, అటువంటిది వారు లంచాలు ఆశించటం సరికాదన్నారు. తమ సంస్థ అవినీతిని ప్రశ్నిస్తోందని, నిజాయితీని గుర్తించి సత్కరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం తమ సంస్థలో 35 వేల మంది సభ్యులు ఉన్నారని, అవినీతి నియంత్రణపై ప్రజలను మరింత జాగృతం చేస్తామని పలనాటి రాజేంద్ర తెలిపారు. సమావేశంలో యాక్ ప్రతినిధులు డాక్టర్ స్రవంతి, ఆశోక్‌కుమార్, నారాయణ, విక్రం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పరుగులు: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

పెద్దకడుబూరు, సెప్టెంబరు 25: సంక్షోభాంధ్రప్రదేశ్ నుంచి స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం పరుగులు పెడుతోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం పెద్దకడబూరులోని ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాగ్రహంతో వైసీపీ పాతాళానికి పడిపోయిందని అన్నారు. వైసీపీ అధినేత జగన్ తన ఎమ్మెల్యేలు, ఎంపీతలలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా పరిపాలన చేశారని తెలిపారు. అదే సీఎం చంద్రబాబు ఎంపీలను దగ్గర కూర్చోబెట్టుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపాలని సూచిస్తున్నారని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి లక్ష్మణ్, బీజేపీ నాయకుడు విష్ణు, మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, హనుమంతు రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఏసేబు, విజయ్ కూమార్, వీరేష్ గౌడ్, బొగ్గుల బాషా, బొగ్గుల తిక్కన్న, సత్యన్న గౌడ్ పాల్గొన్నారు.

ఔషధ సృష్టికర్త ఫార్మాసిస్టే

కర్నూలు జీజీహెచ్‌లో ఘనంగా ఫార్మాసిస్టు డే

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 25: ఔషధ సృష్టికర్తలు ఫార్మసిస్టులేనని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా డిస్పెన్సరీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ 3,800 మంది ఓపీకి వస్తుంటారని, 1200 మంది అడ్మిషన్ పొందుతారని, వీరందరికి మందులు ఇచ్చే విషయంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు మందులను చాలా నమ్మకంతో వాడితే ఏ వ్యాధి అయినా త్వరగా నయమవుతుందన్నారు. మార్కె ట్‌లో వచ్చే ప్రతి మాత్ర ఎన్నో సంవత్సరాల పరిశోధనల తర్వాత బయటకు వస్తుందని తెలిపారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఫార్మసిస్టు ఆఫీసర్ నరసింహారావును ఘనంగా సన్మానించారు. సీఎస్ ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డా.శారద, ఫార్మాసిస్టులు కృష్ణ, మోహన్‌శర్మ, సత్యప్రసాద్, నరసప్ప, శ్రీనివాసులు, రాజేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఫుల్లు



● మామూళ్లు తీసుకోవడం.. పోస్టింగ్ మార్చడం
● జిల్లా రెవెన్యూ కార్యాలయం సిబ్బంది చేతివాటం
● అందులో భాగంగానే బదిలీల్లో మార్పులు చేర్పులు
● గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారికి పోస్టింగ్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25: చీకటి బేరాలకు జిల్లా రెవెన్యూ కార్యాలయం కేంద్రంగా మారిందా.. అక్రమ బదిలీలకు అడ్డాగా తయారైందా.. రెవెన్యూ శాఖలో మంగళవారం జరిగిన పరిణామాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. కలెక్టర్ రంజిత్‌కుమార్ బాషా ఈ నెల 21 తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోల బదిలీల ఆర్డర్స్ విడుదల చేశారు. అయితే వాటిని బేఖాతరు చేస్తూ జిల్లా రెవెన్యూ కార్యాలయంలో పని చేసే ఓ ముగ్గురు మార్పులు చేర్పులకు బరితెగించారు. డబ్బులు ముట్టజెప్పిన వారికి నచ్చిన స్థానాలను కేటాయిస్తూ ఆర్డర్స్‌ను మార్చేరు. ఈ బదిలీల మార్పు వెనకాల రూ.లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.నాలుగైదు లక్షల దాకా తీసుకున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది.

రూ.లక్షలు తీసుకొని మార్పులు చేర్పులు..!

కల్లూరు మండలంలో పని చేసిన సూరిబాబును అనుగొండకు బదిలీ చేయగా తిరిగి కల్లూరుకే కేటాయిస్తూ రెండో దఫా ఆర్డర్స్ ఇవ్వడంపై దుమారం రేగింది. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వీఆర్వోపై రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి ఎందుకు అంత ప్రేమ అన్న చర్చ నడుస్తోంది. డీటీల విషయంలోనూ ఇలాంటి మార్పులు చేర్పులే చేశారని తెలుస్తోంది. భారీగా మామూళ్లు పుచ్చుకొని ఈ బదిలీలకు తెగబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కల్లూరు మండలంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన ఓ వీఆర్వోకు ఓర్వకల్లు మండలంలో పోస్టింగ్ ఇవ్వడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో పని చేసిన వారికే మళ్లీ..

కల్లూరు మండలంలో పని చేస్తున్న వీఆర్వో సూరిబాబును కోడుమూరు మండలం అనుగొండకు బదిలీ చేశారు. క్రిష్ణగిరి మండలం ఎర్రచెంచుగుడి వీఆర్వోగా పని చేస్తున్న మీసాల మద్దిలేటిని కల్లూరుకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్స్ ఈ నెల 21న విడుదల అయ్యాయి. అయితే వీటిని కాదని డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది మంగళవారం కొత్త ఆర్డర్స్‌ను రిలీజ్ చేశారు. అది కూడా ఈ ఇద్దరు వీఆర్వోలకు సంబంధించిన స్థానాలను మాత్రమే మార్చేశారు. ప్రత్యేకించి వీరిద్దని పిలిపించి ఆర్డర్స్‌ను చేతిలో పెట్టడం గమనించాల్సిన అంశం. జిల్లాలోని బదిలీలైన వీఆర్వోలందర్నీ కాదని వీరిద్దరికి మాత్రమే ఆర్డర్స్ మార్చి చేతిలో పెట్టడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని ముద్దనగేరి గ్రామానికి చెందిన బారిక హనుమంతు, గోవిందమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాసులు (25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు తాగునీరు పెట్టేందుకు మోటార్ వైరుకు స్విచ్ ప్లగ్ సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య రూప, కూతురు ఉన్నారు. శ్రీనివాసులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆరోగ్య స్వామి, గోపినాథ్ కోరారు.

నిందితుడికి జైలు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 25: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు జులాయిలు ఘర్షణ పడి హత్యకు దారి తీసిన ఘటనలో నిందితుడిపై నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి. దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. గత ఏడాది నవంబరు 29వ తేదీ రాత్రి స్థానిక టీవీ9 కాలనీకి చెందిన నిందితుడు బోయ నాగరాజు, ఉలిందకొండకు చెందిన మల్లెపోగు ప్రభాకర్ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో బోయ నాగరాజు ఎదపై కూర్చుని ప్రభాకర్ దాడి చేశాడు. ఆత్మరక్షణ కోసం నిందితుడు చేతికందిన ఇటుకతో తలపై మోదీ తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. దీంతో అక్కడే ఉన్న ఫిర్యాది సూర్యచంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ మురళీధర్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ హత్య ఉద్దేశపూర్వకంగా జరగలేదని, ఆత్మరక్షణ కోసం నిందితుడు చేసిన హత్యగా గుర్తించి నిందితునిపై ఆత్మరక్షణ కోసం చేసిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితుడు బోయ నాగరాజుపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. బాలరంగ స్వామి వాదించారు.

చిన్నమరివీడులో డెంగీ కేసు నమోదు

గోనెగండ్ల, సెప్టెంబరు 25: మండల పరధిలోని చిన్నమరివీడు గ్రామంలో వెంకటేష్ అనే వ్యక్తికి డెంగీ సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. దీంతో బుధవారం గోనెగండ్ల వైద్యాధికారులు, మలేరియా అధికారి సాయిబాబా చిన్నమరివీడు గ్రామం చేరుకొని డెంగీ సోకిన వీధిలోని వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే గెంగీ సోకిన వ్యక్తి ఇంటి పరిసరాలలో దోమలు ప్రబలకుండా ద్రావణం పిచికారి చేయించారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని పలు వీధులలో మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుధాకర్, కృష్ణ, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్‌సీ, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో పడి బాలుడి మృతి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 25: ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున, శారదమ్మలకు నలుగురు సంతానం కాగా, హర్షవర్దన్ (6) అనే బాలుడు మూడవ సంతానం.

కాగా తల్లిదండ్రులు పనుల నిమిత్తం బయటకు వెళ్లినప్పుడు తన జేజీ రమణమ్మ వద్ద ఉంచేవారు. బుధవారం జేజీ రమణమ్మ వద్ద ఉన్న హర్షవర్దన్‌ను ఉంచి తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. ఆమె గొర్రెలను మేపేందుకు వెళ్లగా బాబు సమీప పంట పొలాల వద్దకు వెళ్లి కాలువలో పడి ఊపిరాడక మృతి చెందాడు. పిల్లవాడు కాలువలో ఉండటం గమనించిన స్థానిక రైతులు, ఆమె జేజీకి సమాచారం ఇచ్చి హుటాహుటిన గ్రామంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనతో రమణమ్మ అపస్మారనక స్థితిలోకి వెళ్లిపోగా ఆమెను హుటాహుటిన ఓ ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదవశాత్తు కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

టీడీపీతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే గౌరు

● తొగర్చేడు గ్రామంలో
'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

పాణ్యం, సెప్టెంబరు 25 : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం తొగర్చేడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందించిందన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తామన్నారు. అనర్హులకు అందే పింఛన్లపై విచారణ చేసి రద్దు చేస్తామన్నారు. పాణ్యం మండలంలో ఏసీ గోదాం ఏర్పాటు చేస్తామన్నారు. మద్దూరు, తొగర్చేడు గ్రామాల రహదారిని పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ నాయకులు రామిరెడ్డి సభలో మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన జలజీవన్ మిషన్ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అలాగే పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. దీనికి ఆమె స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీలకు శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే శ్మశాన స్థలానికి అవసర మైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. నాడు నేడు కింద నిర్మాణంలో నిలిచిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పూర్తి చేయాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు. కార్యక్రమంలో డీపీవో మంజులావాణి, ఎంపీడీవో దస్తగిరి, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, రంగారమేష్, రమణారెడ్డి, చంద్రోఖర్‌రెడ్డి, ఏపీవో ప్రసాదు, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

నందికొట్కూరురూరల్ : రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమం' నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జయ సూర్య మాట్లాడుతూ వంద రోజులలో ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మంచి నీటి పైపులైన్, మంచినీటి కొళాయిలను ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.


బ్రాహ్మణకొట్కూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతం కార్యక్రమం ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శోభారాణి, ఎన్‌జీ రంగా ప్రాంతీయ పరిశోధనా శాస్త్రవేత్త రామక్రిష్ణారావు, ఏవో షేక్షావలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ హరి సర్వోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ వీరంప్రసాదరెడ్డి, రఘురామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి పాటుపడదాం

మహానంది: అందరి మంచి కోరుతూ రాష్ట్ర ప్రగతికి పాటు పడదామని నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత సెక్రెటరీ చింతం కాంతికుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మహానంది మండలంలోని ఎం.తిమ్మాపురం, గోపవరం, తమ్మడపల్లి గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షులు ఉల్లి మధు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యశస్విని, నియోజకవర్గ వర్గం సమన్వయకర్త రామలింగారెడ్డి, మహానంది దేవస్థానం మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి, ఈవో ఆర్డీ శివనాగజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, టీడీపీ నాయకులు సీహెచ్ రాముడు, గని చిన్న రంగస్వామి, కృపవరం పాల్గొన్నారు.

మద్దూరు ఆసుపత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం

● ఆకస్మిక తనిఖీలో కనిపించని వైద్యులు
● కలెక్టరుకు ఎమ్మెల్యే గౌరు చరిత ఫిర్యాదు

పాణ్యం, సెప్టెంబరు 25 : మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. కేంద్రంలో 15మందికి గాను ఆరుగురు మాత్రమే హాజరైనట్లు హాజరు పట్టీలో నమోదు చేసుకున్నారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో ఎంపీహెచ్‌ఈవోను అడి గి తెలుసుకున్నారు. వైద్యురాలు డాక్టర్ సునీత డిప్యూటేషన్‌పై డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. మరొక వైద్యుడు డాక్టర్ అభిషేక్ ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. ఇద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. కేంద్రం పనితీరుపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన వైద్య సిబ్బంది అందుబాటులో ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. వైద్యసిబ్బంది తీరుపై కలెక్టరు, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ జయరామిరెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయండి: ఎస్పీ


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 25 : ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌కు సంబంధించి పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు, వాటిపురోగతిపై పోలీస్ స్టేషన్ల అధికారులతో ఆరా తీశారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను పూర్తి చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగలించిన సొమ్మును రికవరీ చేయాలని పేర్కొన్నారు. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమీక్షలో ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ, ప్రియతమ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, యువరాజ్, ఎస్సైలు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు అనుసరణీయం


సాగు పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త రవికుమార్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25: రైతన్నలు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు అనుసరణీయమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మండలం పులిమద్ది, బీమవరం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల ఫలితాలను రైతులకు చేరవేసి పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు ఈకార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఒక్క రైతు భూసార ఆధారిత ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడులు పొందుతారన్నారు. విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించండి

● నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 25: మన ఇల్లు-మన గౌరవం పథకం ద్వారా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడు త్వరితగతిన ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొనేలా వార్డు అమ్యూనిటీలు, హౌసింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబి ఆధ్వర్యంలో మన ఇల్లు మన గౌరవం పథకంపై హౌసింగ్, వార్డు అమ్యూనిటీస్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రూఫ్‌లెవల్, స్లాబ్ లెవల్ లో ఉన్న ఇల్లు అక్టోబరు ఆఖరు నాటికి పూర్తి చేసుకోవాలని, మిగిలిన వివిధ దశల్లో ఉన్న ఇల్లు 2025 మార్చి ఆఖరు నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. అప్పటికీ పూర్తి చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందదన్నారు. లబ్ధిదారులతో ఈనెల 28న లేఅవుట్లలో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించి ఇల్ల నిర్మాణాలను పునఃప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ. అరుణ్, పట్టణంలోని వార్డు అమ్యూనిటీలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అపచారం

మహానంది, సెప్టెంబరు 25: తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వైసీపీ ప్రభుత్వ పాలనలో భక్తులకు అందించే లడ్డూ ప్రసాదాల్లో అపచారం జరిగిందని టీడీపీ నాయకులు, భక్తులు ఆరోపించారు. బుధవారం మహానంది మండలం బుక్కాపురం చెన్న కేశవ స్వామి


బుక్కాపురం చెన్నకేశవ స్వామి ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న భక్తులు

ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. ఆలయాన్ని గోమూత్రంతో శుద్ధి చేసి అనంతరం ఆలయం చుట్టూ గోవింద నామస్మరణ చేస్తూ ప్రదక్షణ చేసి గ్రామంలో సంప్రోక్షణ చేశారు. అలాగే గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రామ్మూర్తి శర్మ, మాజీ ఎంపీటీసీ వరలక్ష్మి, టీడీపీ నాయకులు కంచర్ల శివ, నాగపుల్లయ్య, కాకర్ల శివ, జయరాముడు, మారెడ్డి సుబ్రమాణ్యం, సాయిబాబా శ్రీనివాసులు పాల్గొన్నారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో బుధవారం అఖిలభారత బ్రాహ్మణ మహాసంఘం నంద్యాల ఆధ్వర్యంలో ప్రాయశ్చిత సుదర్శన శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. తిరులమలలోని లడ్డు ప్రసాదంలో జరిగిన అపచారమునకు దోష పరిహారార్థం శాంతి హోమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి

● ఆత్మకూరు డ్వామా ఏపీడీ అన్వరాబేగం

కొత్తపల్లి, సెప్టెంబరు 25: జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఆత్మకూరు డ్వామా ఏపీడీ అన్వరాబేగం, ఏపీవో రేష్మా ఐటీడీఏ రాజు నాయక్‌ను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీడీ అన్వరాభేగం పాలక ప్రభుత్వంలో చేపట్టిన వంద రోజుల పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ లేబర్ బడ్జెట్ కింద కొత్తపల్లి మండలంలో 3.20 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. నేటికి 60 శాతం పూర్తి చేశామన్నారు. ఇంకా పని దినాలు కల్పించడంలో మెరుగుపడాలని సూచించారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలో 16 రకాల పండ్ల తోటల పెంపకం కింద 123 మంది రైతులు 146 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. వీరందరికీ ప్రభుత్వ రాయితీ కూడా వర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 25: సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దని కలెక్టర్ రాజకుమారి పీజీఆర్ఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఆడిట్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరిం చిన దరఖాస్తులను సరియైన ఎండార్స్‌మెంట్ ఇ వ్వక పోయినా, పొంతనలేని సమాధానాలు ఇచ్చినా, పూర్తి సమాచారం పొందుపరచకలేకపోయినా రీఓపెన్ చేయాలని ఆదేశించారు. ఆడిట్‌లో సరియైన ఎండార్స్‌మెంట్ లేని ఎనిమి ది దరఖాస్తులను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ కార్యాలయాలకు అర్జీలు పంపించి పరిష్కారం కాని సమస్యల జాబితాను తనకు ఇస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఉచితంగా ఇసుక సరఫరా

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాజకు మారి గనులు భూగర్భశాఖ రాష్ట్ర కార్య దర్శి ప్ర వీణ్‌కుమార్‌కు వివ రించారు. బుధవారం విజ యవాడ గనులు భూగర్భ శాఖ కార్యాలయం నుంచి జిల్లాలో అమలవుతున్న ఉచిత ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్లతో గనులు భూగర్భశాఖ రాష్ట్ర కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయా ల ను, జిల్లాలో పాటించాల్సిన చర్యలను వివరించా రు. వీసీలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, మైనింగ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ అమలుపై ప్రణాళిక సిద్ధం చేయాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 25: గిరిజన సాధికారత, అద్భుత భారతదేశమే లక్ష్యంగా దేశంలోని ఆదివాసీ తెగల అభ్యున్నతికై ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎం జమన్‌మన్) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో 14 మండలాల ఎంపీడీవోలు, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యాధి కారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతి కోసం రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని అందుబాటు లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో విజయవంతం చేసేందుకు ఎంపీడీవోలు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బంది తో సమన్వయం చేసుకుని ఆయా గూడేల్లో గిరిజనుల అభ్యున్నతికి చేపట్టా ల్సిన ప్రణాళికను రూపొందించాలని వివరించారు. ఈ పీఎం జన్‌మన్ మండల కమిటీకి ఎంపీడీవో చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. అక్టోబరు 2న ప్రధానీ మోదీ ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడిం చారు. సమావేశంలో ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కేజీనాయక్, పీహెచ్‌ఓ ధనుంజయ, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ బేబి, ఆత్మకూరు ఎంపీడీవో మోహన్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతానాయక్, అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్

ప్రతి ఎకరాకు సాగు నీరందించాలి

మిడుతూరు, సెప్టెంబరు 25: మండలంలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మిడుతూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాగునీటి కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణుడు, రమణయ్య, మద్దిలేటి, శ్రీనివాసులు లింగస్వామిల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో షేక్షావలి, సుబ్బన్న, స్వామి, శేషన్న, సుబ్బరాయుడు హరినాయుడు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు ఆయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క స్వాములు, జిల్లా నాయకులు వీరన్న, ఆ సంఘం నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఉమారాణికి రైతు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు నక్కస్వాములు, శంకర్ రెడ్డి, దాసు, జ్ఞాన సూర్యుడు, సత్యరాజు, చిన్నస్వామి, మూర్తి, వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రవికుమార్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 25 : నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను విడదీసి సెబ్‌గా ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్ సిబ్బందిని తిరిగి మాతృశాఖకు పంపడంతో ఇటీవల జరిగిన బదిలీల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రవికుమార్ వచ్చారు. గతంలో పని చేసిన మణికంఠ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నంద్యాల క్రైం, సెప్టెంబరు 25 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన నాగశంకరయ్య (22) నంద్యాలకు బైక్‌పై వస్తుండగా పట్టణ శివారులోని విజయ పాల డెయిరీ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో నాగశంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నంద్యాల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. నాగశంకరయ్య మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతుడి తల్లి శివలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25: ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రభుత్వ నిర్దేశిత ఫీజులను మాత్రమే వసూలు చేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని పలు ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

స్వర్ణ రథంపై ఆది దేవుడికి విశేష పూజలు

- వర్షం కారణంగా నిలిచిన వేడుక

శ్రీశైలం, సెప్టెంబరు 25: శ్రీశైలం మహా క్షేత్రంలో బుధవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వర్ణ రథంపై భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మ వార్లకు విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున మల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వర్ణరథాన్ని నేత్రశోభితంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు స్వర్ణ రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు విశేష పూజా దికాలు నిర్వహించి, స్వర్ణ రథానికి కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు సమర్పించారు. వర్షం కారణంగా ఆలయ మాఢవీధుల్లో జరగాల్సి స్వర్ణ రథోత్సవాన్ని నిలుపుదల చేశారు. కార్యక్రమంలో స్వర్ణ రథం ముంగిట కోలా టం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తలను ఆకట్టుకుంది. దేవస్థానం వైదిక కమిటీ సూచన మేరకు లోకకల్యాణార్థం ప్రతి మాసం ఆరుద్రా నక్షత్రం రోజున స్వామివారికి ఈ స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.


స్వర్ణ రథాన్ని లాగుతున్న ఆలయ అర్చకుల, అధికారులు

యాగశాల నిర్మాణానికి శ్రీకారం

మహానంది, సెప్టెంబరు 25: మహానంది క్షేత్రంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు జరిగే దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే హోమాల నిర్మాణానికి బుధవారం ఆలయ వేదపండితులు దాతల చేత భూమి పూజ నిర్వహించారు. పదిరోజుల పాటు జరిగే శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి నిత్యం జరిపే హోమాల కోసం ఆలయం రెండవ ప్రాకారంలోని ఉత్తర గాలి గోపురం పరిసరాల్లో ప్రత్యేక యాగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. కార్యక్రమంలో దాతలు రమణయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శశిధర్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లిఖార్జున్, అధికారి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాములపాడు సెప్టెంబరు 25 : పాములపాడులో నిర్వహించిన ఎస్‌జీ ఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు స్వామి శేఖర్, శ్రీనివాసులు, సుబ్బనాయక్, సాయిరాం, రామ్‌ప్రసాద్, రవీంద్ర నాయుడు పాల్గొన్నారు.

దూర విద్యా కేంద్రాలను రద్దు చేయాలి

● పీఎఫ్ఎస్ నాయకుల డిమాండ్

నందికొట్కూరు, సెప్టెంబరు 25: నందికొట్కూరు పట్టణంలో దూర విద్యా కేంద్రాలను రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలో పీఎఫ్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ఎఫ్ నాయకులు జావీద్, ఖాదర్, అరవింద్ పాల్గొన్నారు.

రేపు ఎంపిక పోటీలు

ఆత్మకూరు, సెప్టెంబరు 25: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 27న శ్రీశైలం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు క్రీడల ని ర్వాహకులు శంకర్, దేవానంద్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లా డుతూ మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర స్థాయిలో ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఈ టోర్నీలో సుమారు 1000 మంది క్రీడాకారు లు పాల్గొనున్నట్లు వారు వెల్లడించారు.

చెడుకు దూరంగా ఉండాలి

బండిఆత్మకూరు, సెప్టెంబర్ 25: విద్యార్థులు ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. బుధవారం బండిఆత్మకూరులోని జ్యోతి హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు వెళ్లి అనవసరంగా జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. అలాగే ఆత్మాశకు వెళ్లి సైబర్ మోసాలకు గురి కావద్దని హెచ్చరించారు. చిన్న వయస్సులో వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడివేముల: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని ఎస్ఐ నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 25: రైతులకు ప్రభుత్వం తక్షణమే పెట్టుబడి సహాయం అందించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకుడు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డేవిడ్, నాగరత్నం, మద్దిలేటిరెడ్డి, రామచంద్రుడు, రత్నమయ్య, సునీల్ పాల్గొన్నారు.

ఆశయ సాధనకు ఉద్యమించాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25 : కార్మిక ఉద్యమ నేత ముక్తార్‌పాషా ఆశయ సాధనకు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ అన్నారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ మాజీ కార్యదర్శి ముక్తార్‌పాషా నాలుగవ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర గణనీయం

పాణ్యం, సెప్టెంబరు 25 : ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర గణనీయమని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ డే వేడుకలు బుధవారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో విశిష్ట సేవలందించిన ఫార్మాసిస్టు లను ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి సత్కరించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

త్రోబాల్ టోర్నమెంట్ కరపత్రం విడుదల

నంద్యాల రూరల్, సెప్టెంబరు 25 : గురురాఘవేంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించనున్న ఎనిమిదవ జిల్లాస్థాయి స్మారక త్రోబాల్ టోర్నమెంట్ కరపత్రాలను బుధవారం పాఠశాల ఆవరణలో ఆ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ నవంబరు 2, 3,4 తేదీల్లో గురురాజా క్రీడా మైదానంలో బాల, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్, పాణ్యం ఎంఈవో సుబ్రమణ్యం, పీఈటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జెడ్‌ఎస్పీ దివాకర్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సంక్షేమం

● నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని

నందికొట్కూరు, సెప్టెంబరు 25: టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిందని నందికొట్కూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని అన్నారు. బుధవారం నందికొట్కూరు 10వ సచివాలయం పరిధిలోని కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి వద్ద వందరోజుల్లో టీడీపీ అమలు చేసి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రియాజ్, ఇమ్రాన్, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

పీరుసాహెబ్ పేటలో ఇరువర్గాల ఘర్షణ

మిడుతూరు, సెప్టెం బరు 25: మండల కేంద్రంలోని పీరుసాహెబ్ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. బుధవారం గ్రామంలో ఒక వర్గం వ్యక్తిపై మరో వర్గం వ్యక్తి దాడి చేశాడు. దాంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని రెండు వర్గాలను చెదరగొట్టి సమస్య సద్దు ముంచే ప్రయత్నం చేశారు. ఓ వర్గం వారు సాయంత్రం నుంచి రాత్రి 10-45 గంటల వరకు పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని భీష్మించారు. ఎస్ఐ ఓబులేసు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో గ్రామ పెద్దలు వారిని గొడవకు దిగకుండా శాంతించారు.


పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఓ వర్గం వారు

సాక్షి గణపతికి విశేష అభిషేకం

శ్రీశైలం, సెప్టెంబరు 25: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలు, పలుఫలోదకాలు, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహామంగళహారతులను సమర్పించారు. ఈ అభిషేక పూజల వల్ల అనుకున్న పనులలో అటంకాలు తొలగి విజయం కలుగుతుందని, సిరిసంపదలు పెరుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచన శక్తి పెరుగుతుందని చెప్పబడుతుంది. అలాగే జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోష కాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది.

మద్యం పట్టివేత

పాములపాడు సెప్టెంబరు 25 : అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పాములపాడు ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లి మండలానికి చెందిన గంధం కృష్ణుడు మద్యం సీసాలను తీసుకెళుతుండగా మండలంలోని చెలిమిల్ల గ్రామం వద్ద అతని వద్ద ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తున్న ఐదు మందిని అరెస్టు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ బుధవారం తెలిపారు. రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మొబైల్ ఫోన్ల రికవరీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 25 : నంద్యాల జిల్లాలోని ప్రజలు వివిధ కారణాలతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. మొబైల్ ఫోన్ పోయిందని సీఈఐఆర్ పోర్టల్, వాట్సాప్ చాట్‌బాట్ సర్వీస్‌ను ఉపయోగించి ఫిర్యాదు చేసిన వారి పోలీస్ కార్యాలయానికి వచ్చి ఆధారాలు చూపించి మొబైల్స్‌ను తీసుకువెళ్లాలని సూచించారు.

శరన్నవరాత్రుల బుక్‌లెట్ విడుదల



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఆర్యవైశ్యులు

బనగానపల్లె, సెప్టెంబరు 25: అక్టోబరు 3వ తేదీ నుంచి నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల బుక్‌లెట్‌ను పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొండపేటలోని అమ్మవారిశాలలో విడుదల చేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, సెక్రటరీ గుండా రవికుమార్ ఆధ్వర్యంలో బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అక్టోబరు 3న బాలత్రిపుర సుందరీమాత అలంకారం, 4న కన్యకా పరమేశ్వరీదేవిగా, 5న గాయత్రిదేవిగా, 6న మీనాక్షీదేవిగా, 7న అన్నపూర్ణదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాష్టమి రోజు మహిషాసుర మర్దినిగా, 11న విజయలక్ష్మిదేవిగా, 12న రాజరాజేశ్వరీమాతగా, 13న వాసవీమాత రథోత్సవం, 14న శ్రీవాసవీమాత అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుండా రవికుమార్, శ్రీనివాసులు, భరతుడు, రామకృష్ణ, నూకల సుబ్బయ్య, విజయకుమార్, వెంకటేశ్వర్లు మురళి పాల్గొన్నారు.

నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో.. మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో అక్టోబరు 3 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో కామేశ్వరీదేవి, ఆలయ మాజీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. అక్టోబరు 3న శైల పుత్రి అలంకారంలో 4న బ్రహ్మచారిణిగా, 5న చంద్రఘటగా, 5న కూష్మాండ, 7న స్కందమాతగా, 8న కాత్యాయనిగా, 9న కళరాత్రి, 10న మహాగౌరీగా, 11న సిద్ధిధాత్రి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, దేవదాయ కమిషనర్ సత్యనారాయణ రానున్నట్లు తెలిపారు.

డోన్ సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాషా

డోన్, సెప్టెంబరు 25: డోన్ సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బజారి కోసిగికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాషాను నియమించారు. ఈ సందర్భంగా నూతన సబ్ రిజిస్ట్రార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా వసంత లక్ష్మి

బేతంచెర్ల: బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా వసంతలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ కరీమ్‌ను ఆత్మకూరుకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో నంద్యాల సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న వసంతలక్ష్మిని బేతం చెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. వసంతలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

శిరివెళ్ల, సెప్టెంబరు 25: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని హెచ్ఎం విజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో శిరివెళ్ల, రుద్రవరం మండలాల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గఫార్, ఉసేన్‌బీలను శాలువ, పూలమాలలతో సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అనూరాధ, న్యాన్సి, షకిలాబి పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

రుద్రవరం, సెప్టెంబరు 25: మండలంలోని చిత్రరేణిపల్లె గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం దాడి చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. దాడిలో 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. లక్ష్మీనరసయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 25: మండల కేంద్రమైన రుద్రవరం గ్రామంలో తెలుగుపేటలో మంగళవారం రాత్రి మాట మాటా పెరిగి ఘర్షణకు దారి తీసిందని ఎస్ఐ వర ప్రసాద్ బుధవారం తెలిపారు. తెలుగుపేటకు చెందిన ఓబులేసు అనే వ్యక్తిపై బాలరాజు, పెద్ద ఓబన్న, మరో ఐదు మంది దాడి చేశారన్నారు. గత నెలలో ఆళ్లగడ్డసంత మార్కెట్ కూరగాయలు అమ్ముకోవడానికి స్థలం విషయంలో ఘర్షణ పడ్డారన్నారు. మాట మాటా పెరిగి ఘర్షణకు దారి తీసిందన్నారు. ఓబులేసు ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాన్ని పూర్తి చేయండి



సంజామలలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

సంజామల, సెప్టెంబరు 25: అక్టోబరు ఆఖరుకల్లా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పీఎంఏవై 1 కింద ప్రారంభించిన గృహాలు రూఫ్ లెవెల్ వరకు కట్టుకున్న వారు అక్టోబరు 30నాటికి, బేస్ లెవెల్‌లో ఉన్న లబ్ధిదారులు మార్చి 2025 నాటికి పూర్తి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు బాలచంద్రుడు, ఉపేంద్రా రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గత ప్రభుత్వంలో మంజూరు అయిన గృహ నిర్మాణాలు వచ్చేఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ నరసింహుడు అన్నారు. మండలంలో 505 గృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈవోపీఆర్డీ మహేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణ, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మన ఇల్లు .. మన గౌరవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనుందని హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, నంద్యాల జిల్లా ఇండస్ట్రియల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ అన్నారు. బుధవారం కొలి మిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయా శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ఇంజనీర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: మన ఇల్లు మన గౌరవం.. కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో బుధవారం ప్రత్యేక అధికారి నాగరాజు సమావేశం నిర్వహించారు. కలెక్టరు రాజకుమారి ఆదేశాల మేరకు గృహ నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 28న గ్రామసభ నిర్వహించాలన్నారు. తహసీల్దారు మల్లిఖార్జున రావు, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

బేతంచెర్ల, సెప్టెంబరు 25: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బేతంచెర్లలో ముమ్మరంగా బుధవారం నిర్వహించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా న్యాయవాది నందిపల్లి నారాయణ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొలతలకు ముద్రలు వేయించండి

సంజామల, సెప్టెంబరు 25: మండల డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీ వినియోగిస్తున్న తూనికలు, కొలతలకు ముద్రలు వేయించాలని డోన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుసేన్ బుధవారం డీలర్లను కోరారు. ఈనెల 26న సంజామల అమ్మవారిశాలలో తూనికలు, కొలతలకు తమ సిబ్బందితో ముద్రలు వేయిస్తామన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తు: ఎమ్మెల్యే

రుద్రవరం, సెప్టెంబరు 25: ఏపీ ప్రజలకు, విద్యార్థులకు చంద్రబాబుతోనే భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రుద్రవరంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం వంద రోజుల పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో వరదలు వచ్చినా కూడా చంద్రబాబు పింఛన్ రూ.4వేలు అందించారన్నారు. రుద్రవరంలోని వడ్డెపేటలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. అలాగే రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం గర్భిణులకు ఎమ్మెల్యే సీమంతం చేసి పూలు పండ్లు అందించారు. కార్యక్రమంలో బోలా గురుమూర్తి, సత్యనారాయణ, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీపీ బాల స్వామి, సర్పంచ్ చంద్రమోహన్, మాజీ సర్పంచ్ నంద్యాల నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రెక్కల మనోహర్‌రెడ్డి, రామనాథరెడ్డి, బండారు బాలరాజు, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహసీల్దారు మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.

● వెంకటేశ్వరి అనే పొదుపు మహిళ సమావేశం వద్ద సొమ్మసిల్లి పడిపోవడంతో చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రుద్రవరంలో తాగునీటి కొళాయిలను తొలగిస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈవో సుబ్బారావు కొళాయిలు తొలగించి నీరు సరఫరా కాకుండా చేస్తున్నారని ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క ఇంటికి కుళాయి ఏర్పాటు చేయించి నీటి సమస్య పరిష్కరిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

ప్రజలు ఎందుకు ఓడించారో ఆలోచించుకోవాలి: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఏం చేసిందని అడుగుతున్నారే గానీ.. రాష్ట్రంలో వైసీపీని ప్రజలు ఎందుకు ఓడించారో ఆ పార్టీ నాయకులు ఒక్కసారైనా ఆలోచించుకున్నారా అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె బుధవారం పాల్గొన్నారు. ఒక్క పిలుపుతో విజయవాడలో వరద బాధితుల కోసం అన్ని శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు ముందుకు వస్తే వైసీపీ నాయకులు మాత్రం చోద్యం చూస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాయకులు వారి జేబులు నింపుకున్నారే తప్ప ఆళ్లగడ్డ అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఆళ్లగడ్డ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గండ్లేరు రిజర్వాయర్ సామర్థ్యాన్ని 0.9 టీఎంసీలకు పెంచేందుకు సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామని, రూ.40కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని ఆమె వెల్లడించారు. గర్భిణులకు సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాశన చేయించారు. అనంతరం మెప్మా సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రామలింగారెడ్డి, కమిషనర్ వెంకట రామయ్య, తహసీల్దార్ రత్నకుమారి, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగాంజనేయులు, సుధా కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ నాయకులు భూమా సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహించారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని దూదెకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం ముత్యాలపాడు బస్టాండు సమీపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పీరయ్య, సుబ్బరాయుడు, మస్తాన్, లాల్‌బాష, దస్తగిరి, పెద్దబాషా, లాలయ్య, బాబు, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదల ఆకలి తీర్చేందుకే సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను ప్రారంభించారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బూరుగుల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో తిరిగి వంద రోజుల టీడీపీ పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజుల్ రహిమాన్, పీఆర్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, కార్యదర్శి ఫ్రాన్సిస్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ఖాజాపీర్, శివారెడ్డి, పురుషోత్తంరెడ్డి, చిన్నిక్రిష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీతో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని బోయ పేట, గౌండాపేటల్లో టీడీపీ నాయకులు కరాటే బాషా, డ్రైవర్ వలి, మహబూబ్‌బాషా, హాజీ వలి, పిదాహుస్సేన్, అహ్మద్‌హుస్సేన్, అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను అతికించారు.

అవుకు: అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం దూసుక పోతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విజయభాస్కర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో అశ్వనీకుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: వంద రోజుల పాలనతో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వంపై మరింత నమ్మకం పెరిగిందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామే శ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వీఆర్ లక్ష్మీరెడ్డి, సర్పంచ్ శివశంకర్, పెద్దిరెడ్డి, వెంకటమల్లారెడ్డి, రామలక్ష్మణ్ణ, పెద్ద వెంకటేష్, అంకిరెడ్డిపల్లెల్లో నంద్యాల రామేశ్వరరెడ్డి, నంద్యాల నారాయణరెడ్డి, ఈశ్వర రెడ్డి, రమణారెడ్డి అధికారులతో కలిసి మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కొలిమిగుండ్లలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, నరసింహుడు, ప్రసాదు, బొట్టు స్వామి, గొర్విమానుపల్లెలో ఎంపీటీసీ షలి ప్రకాశ్‌రెడ్డి, మూలే హుశేన్‌రెడ్డి, తిమ్మనాయి నిపేటలో గోపాల్, గిరి, తుమ్మలపెంటలో తోట అమర్‌నాథ్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, అంబటి లక్ష్మీనారాయణరెడ్డి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ తిరిగి వంద రోజుల పాలనపై ప్రజలకు వివరించారు.

కోవెలకుంట్ల: చంద్రబాబుతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కోవెలకుంట్ల మాజీ సింగిల్ అధ్యక్షుడు గువ్వల సుబ్బారెడ్డి, బిజినవేముల టీడీపీ నాయకులు గజ్జల ఉసేనయ్య అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండలంలోని బిజినవేముల జొలదరాశి, పొట్టిపాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సుందర్‌రెడ్డి, బిజినవేముల రాధా క్రిష్ణమూర్తి, మనోహర్, పెద్దహుసేన్, సుబ్బరాయుడు, షరీఫ్ పాల్గొన్నారు.



రుద్రవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బూరుగులలో మాట్లాడుతున్న నాగేశ్వరావుయాదవ్



అవుకులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న చల్లా విజయభాస్కర్‌రెడ్డి



మంచి ప్రభుత్వం పోస్టర్లు ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

సంజామల: విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని నొస్సం టీడీపీ సీనియర్ నాయకుడు గాధంశెట్టి రమణయ్య, వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నొస్సం, ఆల్వకొండ, ముక్కమళ్ల గ్రామాల్లో నందిరెడ్డి విష్ణుశేఖర్ రెడ్డి, మూసాని చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

డోన్(రూరల్): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంజిత్, నబీరసూల్, రాజశేఖర్‌గౌడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు టీడీపీ ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని టీడీపీ మైనార్టీ నాయకులు జాకీరుల్లాబేగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలోని ప్రాంతాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి వంద రోజుల్లో టీడీపీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఇంటికి స్టిక్కర్లు అతికించారు.

చాగలమర్రిలో కుండపోత వర్షం



చాగలమర్రిలో పొంగి ప్రవహిస్తున్న అడ్డవాగు

చాగలమర్రి, సెప్టెంబరు 25: చాగలమర్రి మండలంలో బుధవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. 18.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. మెట్ట పొలాల్లో సాగు చేసిన కంది, పత్తి, మినుము, మొక్కజొన్న, ఉల్లి పంటలకు జీవం పోసింది. చాగలమర్రి గ్రామ సమీపంలోని అడ్డవాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. తెలుగుగంగ ప్రధాన కాలువలో వచ్చే లీకేజీ నీరు, వరద నీరు కలిసి ప్రవహించడంతో వంక ప్రవాహం అధికమైంది. వాగులు, వంకలు వర్షపు నీటితో జలకళ సంత రిం చుకున్నాయి. గొడిగనూరు, శెట్టివీడు, ముత్యాలపాడు, చాగలమర్రి, పెద్దబో దనం సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది.

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 25: జనసంఘ్ పార్టీ పూర్వ అధ్యక్షుడు దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు బోరెడ్డి లక్ష్మీరెడ్డి, మురళీధర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని బీజేపీ కార్యాల యంలో దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాం పుల్లయ్య, బాలాంజనేయులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 25: రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. పట్ట ణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచి పోతున్నా సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలో అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు సిద్ధమైందని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను సీఎం చంద్రబాబు చొరవ చూపి ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకన్న, రాదాకృష్ణ, మోట రాముడు, పట్టణ నాయ కులు నారాయణ, వరదరాజు పాల్గొన్నారు.

27లోపు గ్రామ విజన్ ప్లాన్ అందించాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 25: మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశానుసారం వచ్చే ఐదేళ్లలో చేపట్టాల్సిన గ్రామ విజన్ ప్లాన్ ఈనెల 27లోపు అందించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసయాదవ్, ఎంపీడీవో ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా వచ్చే ఐదేళ్లలో మీ విజన్ .. మా మిషన్ పేరుతో అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈవోఆర్డీ శ్రీహరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

రుద్రవరం, సెప్టెంబరు 25: రుద్రవరం ఆదర్శ పాఠశాల పూర్వవిద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించినందున ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించి శాలువతో సన్మానించారు. బుధవారం రుద్రవరంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో విద్యార్థులు బిందు, చాయాదేవి, లోకేశ్, పూజిత, శరత్‌లను అభినందించారు. తల్లిదండ్రులు, మన ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఉన్నారు.

750 హెక్టార్లలో పండ్లతోటల సాగు

చాగలమర్రి, సెప్టెంబరు 25: నంద్యాల జిల్లా క్లస్టర్ పరిధిలో 750 హెక్టార్లలో హార్టికల్చర్ కింద పండ్ల తోటలు సాగు చేస్తున్నట్లు ఉపాధి ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో రైతులు సాగు చేసిన మల్లెతోటను పరిశీలించారు. పెద్దబోదనం గ్రామంలో వర్షపు నీరు వృథాపోకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి ఆర్వే స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో 550 హెక్టార్లలో పండ్ల తోటల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల చివరి నాటికి 200 హెక్టార్లు సాగు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. చాగలమర్రి గ్రామంలో 100 ఎకరాలకు గాను 82 ఎకరాలు సాగు చేశారని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద 18.20 లక్షలు పనిదినాలకు గాను 11.20 లక్షల పనిదినాలు కూలీలకు కల్పించామని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన సుబ్బారెడ్డి



సీఎం చంద్రబాబు, మంత్రి బీసీలతో ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో చంద్రబాబును ఆయా కార్పొరేషన్ల నూతన ఛైర్మన్లతో కలిసి సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డి కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్యాపిలి, సెప్టెంబరు 25: బాధిత కుటుంబాలను మాజీ మంత్రి బుగ్గన తనయుడు, వైసీపీ యువనాయకుడు అర్జున్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్టీ కార్యకర్త నరసింహులు కుటుంబాన్ని, రామక్రిష్ణాపురంలో అనారోగ్యంతో ఉన్న వైసీపీ నాయకుడు ధనుంజయను, వెంగళాపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్త అర్జున్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, క్రిష్ణమూర్తి, బోరెడ్డి రాము, రజని రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'క్లీన్ అండ్ గ్రీన్'

బనగానపల్లె, సెప్టెంబరు 25: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కౌసల్యాదేవి ఆధ్వర్యంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ముళ్లకంపలు, చెత్తా, చెదారాన్ని విద్యార్థులు తొలగించారు.

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములమవుదాం

శిరివెళ్ల, సెప్టెంబరు 25: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములమవుదామని టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళికలతో కూడిన పోస్టర్లను బోయలకుంట్ల గ్రామంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సనాతన ధర్మం జోలికొస్తే సహించేది లేదు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 25: సనాతన ధర్మం జోలికొస్తే ఏమాత్రం సహించేది లేదని జనసేన ఆళ్లగడ్డ సమన్వయకర్త మైలేరి మల్లయ్య హెచ్చరించారు. తిరుమల పవిత్ర క్షేత్రంలో లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రతను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పడకండ్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆయన దీక్ష చేపట్టారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లయ్య డిమాండ్ చేశారు. బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి బోరెడ్డి లక్ష్మీరెడ్డి, రాము, మురళీధర్ గౌడ్, ఆదినారాయణరెడ్డి, జనసేన నాయకులు మైలేరి శ్రీరాములు, వెంకట సుబ్బయ్య, కోటి, గుర్రప్ప, జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

డోన్(రూరల్), సెప్టెంబరు 25: పట్టణంతో పాటు మండలంలో కబ్జా అయిన ప్రభుత్వ భూములను కాపాడాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ నాగమణిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణ పరిసరాల్లో వంక పోరంబోకు పొలాలను కబ్జా చేసి వాటిలోనే వెంచర్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణపై అవగాహన కల్పించండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 25: స్వర్ణాంధ్ర 2047పై ప్రజలకు అవగాహన కల్పించి స్వర్ణాంధ్ర క్యూఆర్ కోడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలు సేకరించాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా సచివాయాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తహసీల్దారు శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గ్రామ సమస్యలపై ఆ గ్రామ ప్రజల అభిప్రాయాలు సేకరించాలన్నారు.

రైతుల కోసమే పొలం పిలుస్తోంది

డోన్(రూరల్), సెప్టెంబరు 25: రైతుల కోసమే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టినట్లు డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మకొండ, వెంకటాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద ఇండియన్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ నుంచి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ గణేష్, నంద్యాల టెక్నికల్ వ్యవసాయాధికారి హరిప్రియ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ పెస్ట్ సర్వేలాంగ్ సిస్టమ్ యాప్ గురించి రైతులకు వివరించారు. ఏవో అబ్దుల్ షఫీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కోవెలకుంట్ల: పాడి పరిశ్రమ ఉన్న ఇంట్లో సిరుల పంట ఉంటుందని కలుగొట్ల పశువైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని చిన్నకొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ప్యాపిలి: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్త వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రాజేష్, ఉద్యానవన అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.


దొర్నిపాడు: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సునీత అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యూకొత్తపల్లి, డబ్ల్యూగోవిందిన్నె గ్రామాల్లో వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో సురేంద్ర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: రైతులు తమ పంట పొలాలకు మట్టి పరీక్షల ఆధారిత ఎరువులను వినియోగించాలని నంద్యాల వ్యవసాయాధికారి(డీఆర్‌సీ) ప్రభావతమ్మ, సైంటిస్ట్ నీలిమ సూచించారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు సాగు మెళకువలు వివరించారు. అనంతరం వరి, మినుము పంటలో మేలైన విత్తన రకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఏవో రంగనేతాజీ అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలపాడు, తోడెండ్లపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి సాయిబాబా, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో పొలం పిలుస్తోంది
కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు



చిన్నకొప్పెర్లలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి విజయలక్ష్మి

బేతంచెర్ల: రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని అందించడం కోసమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ముద్దవరం, ఎం.పెండేకల్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, వెటర్నరీ డాక్టర్ రంగస్వామి, ఏఈవోలు మధు, జెన్నిరాజు, ముద్దవరం అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగమణి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: వరి పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఇన్‌చార్జి ఏంఏవో ఉమమహేశ్వరి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నర్సిపల్లె గ్రామంలో పర్యటిం చారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రాణెమ్మ, వీఏఏ సాయి, రైతు పల్లె బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.